నిర్మాణాలను పరిశీలించిన అధికారులు



నిర్మాణాలను పరిశీలిస్తున్న హైడ్రా, ఇరిగేషన్ శాఖల అధికారులు

నిజాంపేట్: బాచుపల్లిలోని వాసవి కన్‌స్ట్రక్షన్ నిర్మాణాన్ని హైడ్రా, ఇరిగేషన్ అధికారులు సోమవారం పరిశీలించారు. 8, 9 బ్లాక్‌లు కోమటికుంట ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌ల్లో నిర్మించారన్న ఆరోపణలు, ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో హైడ్రా అధికారులు ఎంతవరకు చెరువు బఫర్ జోన్‌లోకి జరిగి నిర్మాణాలు చేశారన్న విషయాన్ని కులంకుషంగా పరిశీలించారు. అదేవిధంగా బాచుపల్లి ఎల్లమ్మకుంట చెరువు ఆక్రమణలను సైతం పరిశీలించారు. త్వరలోనే ఆక్రమణలపై నివేదిక రూపొందించి తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు హైడ్రా అధికారులు తెలిపారు. అధికారులకు చెరువుల ఆక్రమణ ఎంత మేరకు జరిగిందన్న విషయాన్ని జేపీ నాయకులు ఆకుల సతీశ్, ఎంబరి ఆంజనేయులు, పీసరి కృష్ణారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, అరుణ్ రావు, ఎల్ల స్వామి, శ్రీనివాస్ గౌడ్ తదితరులు వివరించారు. హైడ్రా అధికారుల వెంట స్థానిక మండల రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు ఉన్నారు.

బతుకమ్మ ఘాట్‌ను విస్తరించాలి



ఉప కమిషనర్ మలయ్యకు వినతి పత్రం అందజేస్తున్న వెంకటేశ్

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ పరిధి దేవేందర్‌నగర్‌లోని బతుకమ్మ బండలో ఉన్న బతుకమ్మ ఘాట్‌ను సుందరీకరణ చేసి విస్తరించాలని కాలనీ అధ్యక్షుడు చెట్ల వెంకటేశ్ కోరారు. ఆయన ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణిలో ఉప కమిషనర్ మలయ్యను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తులు రాత్రికి రాత్రే బతుకమ్మ ఘాట్‌లో మట్టిని నింపుతున్నారని తగు చర్యలు తీసుకోవాలని, అలాగే బతుకమ్మ ఘాట్‌లో సీసీ రోడ్డు, ప్లాట్‌ఫారం, రెస్ట్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. ఆయన వెంట కాలనీ ప్రధాన కార్యదర్శి శివప్ప తదితరులు ఉన్నారు.

పార్కింగ్ స్థలంలోనే భారీ వాహనాలు నిలపాలి



ఎమ్మెల్యే వివేకానంద్‌కు ఫిర్యాదు చేస్తున్న సభ్యులు

కుత్బుల్లాపూర్: ట్రక్కులకు కేటాయించి స్థలంలోనే భారీ వాహనాలు పార్కింగ్ చేసేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. సుభాష్‌నగర్ డివిజన్ ఎస్ఆర్ నాయక్‌నగర్‌లో ఇండస్ట్రియల్ ఏరియాకు చెందిన ట్రక్కులు, లారీలను రోడ్లపై ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తున్నారని, దీంతో తరచూ ట్రాఫిక్ జామ్ అవుతోందని చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్ఆర్ నాయక్‌నగర్ సంక్షేమ సంఘం సభ్యులు సోమవారం ఎమ్మెల్యేను కలిసి విన్నవించారు. దీనిపై స్పందించిన వివేకానంద్ ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్‌కు ఫోన్ చేసి పార్కింగ్‌కు కేటాయించిన స్థలంలో భారీ వాహనాలు నిలిపేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బీఆర్ఎస్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ, పీవీ భాస్కర్ రెడ్డి, ఎస్ఆర్ నాయక్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పూర్ణచంద్రగుప్తా, ఉపాధ్యక్షుడు హరిబాబు యాదవ్, బొలిశెట్టి దుర్గారావు, అనిల్ కుమార్, సీతారామరాజు, రామరాజు తదితరులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్‌తో మెరుగైన వైద్యం



నాగరాజుకు ఎల్ఓసీ పత్రాన్ని అందజేస్తున్న హన్మంతరెడ్డి

రంగారెడ్డినగర్: సీఎం రిలీఫ్ ఫండ్ పథకంతో పేదప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందుతున్నాయని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ ఇందిరానగర్‌కు చెందిన నాగరాజు తలకు తీవ్ర గాయం కావడంతో నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. కాగా శస్త్ర చికిత్స చేయాలని వైద్యులు సూచించడంతో బాధితుడు హన్మంతరెడ్డిని ఆశ్రయించాడు. దీనిపై స్పందించిన ఆయన రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబుతో మాట్లాడి రూ. 2.5 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్ఓసీ పత్రాన్ని మంజూరు చేయించారు. సదరు పత్రాన్ని బాచుపల్లిలోని కార్యాలయంలో హన్మంతరెడ్డి లబ్ధిదారుడు నాగరాజుకు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో రంగారెడ్డినగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివ కుమార్, శ్రీధర్ రెడ్డి, వెంకటేశ్, సోమయ్య, జ్ఞానేశ్వర్ ముదిరాజ్ తదితరులు ఉన్నారు.

ప్రజావాణికి ఫిర్యాదులు



ప్లకార్డులు ప్రదర్శిస్తూ డీసీ నరసింహకు ఫిర్యాదు చేస్తున్న ప్రజలు

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల కార్యాలయాల్లో సోమవారం అధికారులు ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో 130 డివిజన్ కృషి కాలనీ నుంచి పాండుబస్తీ మెయిన్ రోడ్డులో గణేశ్ బ్రదర్ బట్టల షాపు యజమాని విద్యుత్ స్తంభం తొలగించి రోడ్డును ఆక్రమించి నిర్మాణం చేపడుతున్నాడని, మూడు నెలలుగా కాలనీ ప్రజలు ప్రజా భవన్, జీహెచ్ఎంసీ, జోనల్, కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయాల్లో ఫిర్యాదులు చేశామన్నారు. ఎమ్మెల్యేతో పాటు ఉప కమిషనర్ నిర్మాణాలు నిలిపేయాలని ఆదేశించినా స్థానిక రాజకీయ నాయకుల అండదండలతో పనులు కొనసాగుతున్నాయని ఆరోపించారు. ఇందుకు నిరసనగా సర్కిల్ కార్యాలయంలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఆందోళన చేపట్టారు. అదేవిధంగా గాజులరామారం సర్కిల్‌లో డీసీ మల్లయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజావాణిలో రెండు ఫిర్యాదులు అందాయి.

వైఎస్ఆర్‌కు ఘన నివాళి

- నియోజకవర్గవ్యాప్తంగా వర్ధంతి
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు



షాపూర్‌నగర్‌లో వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: నియోజకవర్గవ్యాప్తంగా మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని సోమవారం నిర్వహించారు. వైఎస్సార్ అభిమానులు, కాంగ్రెస్ నాయకులు ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వైఎస్ రాజశేఖర్‌రెడి హయాంలో కుత్బుల్లాపూర్ ప్రాంతంలో చేపట్టిన అభివృద్ధి పనులను గుర్తు చేసుకుంటూ ఆయన సేవలను కొనియాడారు.

- షాపూర్‌నగర్‌లో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ ఏ బ్లాక్ అధ్యక్షుడు బండి శ్రీనివాస్ గౌడ్, మాజీ కౌన్సిలర్ రంగారావు, బుచ్చిరెడ్డి, కూన రాఘవేంద్ర గౌడ్, చౌడా శ్రీనివాసరావు, నాగిళ్ల శ్రీనివాస్, పండారి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు రాజనోళ్ల లక్ష్మి, పూలమ్మ. బలరాం తదితరులు పాల్గొన్నారు.
- గాజులరామారం చిత్తరమ్మ దేవీనగర్‌లోని కాంగ్రెస్ కార్యాలయం వద్ద పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సొంటి రెడ్డి పున్నారెడ్డి వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం విద్యార్థులకు నోటు బుక్కులు పంపిణీ చేశారు. వెంకటరామిరెడ్డి, సైదా రెడ్డి, పాండు, ఉమేశ్, సిద్ధారెడ్డి తదితరులు పాల్గొన్నారు
- నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రగతినగర్, నిజాంపేట్ ప్రాంతాల్లోనూ వైఎస్ఆర్ విగ్రహాలు, చిత్రపటాలకు కాంగ్రెస్ నేత కొలను శ్రీనివాస్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏనుగుల మధుసూదన్ రెడ్డి, శ్రీశైలం యాదవ్, ప్రవీణ్ రెడ్డి, నరసింహారెడ్డి, శ్రీనివాస్, బాలకృష్ణ, ప్రేమ్ కుమార్, రఘు, ప్రశాంత్ రెడ్డి, రామకృష్ణారెడ్డి. రమణారెడ్డి ఉన్నారు.
- బాచుపల్లి కాంగ్రెస్ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలను హనుమంత్‌రెడ్డి వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నిజాంపేట కాంగ్రెస్ అధ్యక్షుడు కులం రాజశేఖర్ రెడ్డి, కార్పొరేటర్ వీరేందర్ రెడ్డి, సంజీవరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నవీన్, రాజిరెడ్డి, విక్రమ్ పాల్గొన్నారు.



చిత్తారమ్మనగర్‌లోని పార్టీ కార్యాలయంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి..



నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో కొలన్ శ్రీనివాస్‌రెడ్డి..



బాచుపల్లిలో కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి..



ప్రగతినగర్‌లో నివాళులర్పిస్తున్న వైఎస్ఆర్ అభిమానులు

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని మగ్దూంనగర్ పోచమ్మ గుడి సమీపంలో తరుచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగి స్థానికకులు ఇబ్బంది పడేవారు. జనాభాకు అనుగుణంగా పాత 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ లోవోల్టేజీ సరిపోవడం లేదని స్థానికులు పలుమార్లు ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు సోమవారం 160 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. దీంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

బాధ్యతల స్వీకరణ



కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సౌజన్య

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా దేవులపల్లి సౌజన్య సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకుముందు కమిషనర్ రామకృష్ణరావుపై హైడ్రా అధికారులు కేసులు నమోదు చేసిన నేపథ్యంలో ఆయన స్థానంలో సౌజన్య కమిషనర్‌గా వచ్చారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన కమిషనర్‌ను బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గణేశ్ ఉత్సవాల నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ నిజాంపేట్ బీజేపీ అధ్యక్షుడు భిక్షపతియాదవ్, ప్రగతినగర్ అధ్యక్షుడు నరేంద్రచౌదరి ఆధ్వర్యంలో కమిషనర్‌కు వినతి ప్రతం అందజేశారు. బీజేపీ పార్లమెంట్ మీడియా సెల్ కన్వీనర్ సుమన్‌రావు, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి దాసి నాగరాజు, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి రవియాదవ్‌లు తదితరులు ఉన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వివేకానంద్ సూచించారు. కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల అధికారులతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీలు, బస్తీల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా దోమల నివారణ కోసం ఫాగింగ్ చేయించాలని, వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఉప కమిషనర్లు నర్సింహ, మల్లారెడ్డి, ఇంజినీరింగ్ డీఈ రూపాదేవి, ఈఈ లు లక్ష్మీగణేశ్, కిష్టప్ప, ఏఈలు మల్లారెడ్డి, రవీందర్, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ఇండ్లు

దుండిగల్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు దుండిగల్‌లోని రెండు ఇండ్లు పాక్షికంగా కూలిపోయాయి. దుండిగల్‌లోని మూడో వార్డులో తమ్మలి రాజు, తమ్మలి బాలమణి భార్యాభర్తలు. రాజు గతంలోనే మృతి చెందగా బాలమణి ఇండ్లలో పని చేస్తూ తన ఇద్దరు కుమార్తెలను పోషిస్తుంది. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి ఇల్లు కూలిపోతుండడంతో వెంటనే అప్రమత్తమై తన కూతుళ్లతో కలిసి బయటకు వచ్చింది. అదే విధంగా దార రుక్కమ్మ, రాజలింగం దంపతులు నివసిస్తున్న ఇల్లు సైతం కూలిపోయింది. ఈ ఘటనలో ఎవరికి గాయాలు కాలేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.



సమస్యలపై అధికారులు సత్వరమే స్పందించాలి



డ్రైనేజీని పరిశీలిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యలపై అధికారులు సత్వరమే స్పందించి పరిష్కారానికి చొరవ తీసుకోవాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ సూచించారు. కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని అపర్ణ పామ్ గ్రోవ్, అవని గార్డెన్స్, నూజివీడు స్వీడ్స్ పరిసర ప్రాంతాల్లో సోమవారం ఆయన పర్యటించారు. వర్షాల కారణంగా డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేక, గుంతలమయమైన రోడ్లపై ప్రవహిస్తున్న వరద, పొంగుతున్న నాలాలను పరిశీలించారు. మూడు రోజులుగా అపర్ణ పామ్ గ్రోవ్‌లో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని, అలాగే డ్రైనేజీ సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన సంబంధింత అధికారులకు ఫోన్ చేసి పరిష్కరించాలని ఆదేశించారు. అదేవిధంగా అపర్ణ పామ్ గ్రోవ్ సెప్టిక్ ట్యాంక్ నుంచి ప్రధాన మురుగునీటి కాలువ పనులు వెంటనే ప్రారంభించి శాశ్వత పరిష్కారం చూపాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆయన వెంట బీజేపీ నాయకులు రాజిరెడ్డి, సతీశ్ సాగర్, శివాజీరాజా, జనార్దన్ రెడ్డి, సరిత రావు, శ్రీధర్ రెడ్డి, నరసింహ రెడ్డి, సత్యనారాయణ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల పరిశీలన



లక్ష్మీశ్రీనివాస నిర్మించిన అక్రమ విల్లాలను పరిశీలిస్తున్న హైడ్రా, ఇరిగేషన్ అధికారులు



కత్వ చెరువు కాలువ మ్యాప్‌ను పరిశీలిస్తున్న అధికారులు

దుండిగల్: మల్లంపేటలోని శ్రీ లక్ష్మీ శ్రీనివాస కన్‌స్ట్రక్షన్స్ సంస్థ కత్వ చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లల్లో అక్రమంగా విల్లాలు నిర్మించిన విషయం తెలిసిందే. సోమవారం హైడ్రా అధికారి రోహిత్‌రెడ్డి తన బృందంతో పాటు ఇరిగేషన్ ఏఈ సారాతో కలిసి పరిశీలించారు. చెరువు స్థలాన్ని కబ్జా చేసి చేపట్టిన అక్రమ నిర్మాణాల వివరాలను సేకరించారు. నివేదికను హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు అందించిన అనంతరం ఆయన ఆదేశాల మేరకు కూల్చివేతలు తీసుకోనున్నారు.

కట్టను పరిశీలించిన అధికారులు..

మల్లంపేటలోని కత్వ చెరువు 100 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. దుండిగల్ మండలంతో పాటు పక్కనే ఉన్న జిన్నారం మండలం నుంచి వర్షపు నీరు ఈ చెరువులోకి చేరుతుంది. అక్కడ ఉన్న నాలాను కొందరు వ్యక్తులు కబ్జా చేసి దారి మళ్లించడంతో నీరంతా వృథాగా పోతుంది. దీంతో బీజేపీ నేత ఎంబరి ఆంజనేయులు అధికారులకు ఫిర్యాదు చేయగా స్పందించిన అధికారులు నాలాకు అడ్డుగా పెట్టిన కట్టను తొలగించారు.

పారుతున్న వరద.. పొంగుతున్న డ్రైనేజీలు..!



ఆదర్శనగర్‌లో వరదను తొలగిస్తున్న జలమండలి ఎమర్జెన్సీ టీం ..



సుభాష్‌నగర్ పైపులైన్ రోడ్డులో పారుతున్న వరద



పనులను పర్యవేక్షిస్తున్న జలమండలి డీజీఎం రాజేశ్

చింతల్: సుభాష్‌నగర్ పైప్‌లైన్ రోడ్డులో వరద ఇంకా పారుతూనే ఉంది. మరోవైపు భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్లు పొంగిపొర్లుతున్నాయి. రోడ్లపై నిలిచిన వరదను జీహెచ్ఎంసీ, జలమండలి ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ ఎప్పటికప్పుడు నీటిని దారి మళ్లిస్తున్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో మాత్రం నీరు రోడ్లపై పారుతుండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం పలు ప్రాంతాల్లో రోడ్లపై పేరుకుపోయిన చెత్తను తొలగించడంతో పాటు వరదను జేసీబీ సహాయంతో దారి మళ్లించారు.

నీటి సమస్య తీర్చినందుకు సన్మానం



రాజేశ్వరరావును సన్మానించిన ఇంద్రానగర్ వాసులు

బాలానగర్: నీటి సమస్య తీర్చాలని ఇంద్రానగర్ సంక్షేమ సంఘం నాయకులు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు కోరగా, ఆయన స్పందించి గత నెల 30న ఇంద్రానగర్ హనుమాన్ ఆలయంలో బోరు వేయించారు. దీంతో సోమవారం కాలనీవాసులు వడ్డేపల్లి రాజేశ్వరరావును ఆయన నివాసంలో కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇంద్రానగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గిరి సాగర్, ప్రధాన కార్యదర్శి ఎం.అర్జున్, కోశాధికారి రాజు, సభ్యులు రవి సాగర్, నాగరాజు, అనిల్, విజయ్, బస్తీ వాసులు పాల్గొన్నారు.

పడకేసిన పారిశుధ్యం

ఓవైపు వర్షాలు.. మరోవైపు చెత్తతో ప్రజల ఇబ్బందులు



రంగారెడ్డినగర్‌లో పేరుకుపోయిన చెత్త వ్యర్థాలు



ఐడీపీ గాంధీనగర్ ప్రాంతంలో ..

రంగారెడ్డినగర్: ఓవైపు ఎడతెరిపి లేకుండా కురుస్తునన వర్షాలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే మరోవైపు ప్రధాన రోడ్లపై పేరుకుపోయిన చెత్తాచెదారాలు ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. రంగారెడ్డినగర్ పరిధిలోని ఐడీపీ గాంధీనగర్, రంగారెడ్డినగర్‌లో ప్రధాన రోడ్లపై కొన్ని రోజులుగా చెత్తను తరలించకుండా సంబంధిత సిబ్బంది అలాగే వదిలేశారు. దీంతో ఇటీవల కురుస్తున్న వర్షాలతో చెత్తవ్యర్థాలు కుళ్లి తీవ్ర దుర్వాసన వస్తున్నది. స్థానికులు అనారోగ్యాల బారిన పడే ప్రమాదం ఉందని వెంటనే చెత్తను తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అన్నదానాలు



జగద్గిరిగుట్టకొండపై ప్రత్యేక అలంకరణలో కాళికాదేవి అమ్మవారు..

జగద్గిరిగుట్ట: అమావాస్యను పురస్కరించుకొని సోమవారం డివిజన్‌లోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అన్నదానాలు నిర్వహించారు. జగద్గిరిగుట్ట కొండపై ఉన్న కాళికాదేవి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, మాణికేశ్వరిమాతా ఆలయంలో మహా లింగార్చన మహోత్సవం, జగద్గిరిగుట్ట లాస్ట్ బస్టాప్ దుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే మగ్దూంనగర్, మైసమ్మనగర్‌లో బొడ్రాయిల వద్ద స్థానిక నాయకులు జైహింద్, సంక్షేమ సంఘం నాయకులుపూజలు నిర్వహించారు. దుర్గమ్మ ఆలయం వద్ద శ్రీ వాసవి సేవా సమితి, కాళికామాతా ఆలయంలో కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానాలు నిర్వహించారు.



మగ్దూంనగర్‌లో బొడ్రాయి వద్ద పూజలు ..



మాణికేశ్వరిమాత ఆలయంలో..



జగద్గిరిగుట్ట లాస్ట్ బస్టాప్ అన్నదానం..



మైసమ్మనగర్ బొడ్రాయి వద్ద ..